సాక్షి
తిరుపతి
గురువారం । 11 । మే । 2023



విధి నిర్వహణలో అలసత్వం వద్దు

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు హెచ్చరించారు. -8లో



జగనన్నకు చెబుదాంతో సత్వర న్యాయం

సమస్యలను సత్వరం పరిష్కారించేందుకే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం ప్రారంభించిందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. -8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	40	27
చిత్తూరు	38	26
తిరుమల	35	23
గూడూరు	40	28
నగరి	41	27

న్యూస్‌రీల్

18 వరకు మీడియా అక్రిడిటేషన్ల దరఖాస్తులు

తిరుపతి అర్బన్: ఈనెల 18వ తేదీ వరకు మీడియా అక్రిడిటేషన్ల దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కె.వెంకటరమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2023-24 రెండు సంవత్సరాల మీడియా అక్రిడిటేషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులకు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.ఐపీఆర్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టులు వివరాలతోపాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లో అలాగే దరఖాస్తుదారు సంతకం, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలని, అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు, డౌన్ లోడ్ చేసిన అప్లికేషన్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తిరుపతి జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఈనెల తేదీ 18 లోపు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

ప్రశాంతంగా పాలిసెట్

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్హతతో పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించే పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష బుధవారం తిరుపతి, గూడూరుల్లోని 16 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. తిరుపతి జిల్లా నుంచి 5,013మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతిలో 8, గూడూరులో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 3.877మంది, గూడూరులోని 8 పరీక్ష కేంద్రాల్లో 1,136మంది, మొత్తం 5.013 మంది హాజరు కావాల్సి ఉంది. తిరుపతిలో 411మంది, గూడూరులో 132మంది, మొత్తం 543 మంది గైర్హాజరనట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,237 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,926 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.50 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.32 కోట్లు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానానికి హుండీ కానులక ద్వారా రూ.2.32 కోట్ల ఆదాయం లభించింది. కానుకలను బుధవారం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.2,32,19,079 ఆదాయంగా వచ్చినట్లు దేవస్థానం ఈవో సాగర్ బాబు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు కానుకల లెక్కింపు జరిగింది. మార్చి 28వ తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదు రూ.2,32,19,079, బంగారం 129.200 గ్రాములు, వెండి 842.5కిలోలు, వివిధ దేశాల 119 కరెన్సీ నోట్లు ఉన్నాయి. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

షుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల వేలం వాయిదా



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: పాటదారులు రాకపోవడంతో మండలంలోని సుదలగుంట షుగర్ ఫ్యాక్టరీ భూములు, ఆస్తుల వేలం వాయిదా వేసినట్లు డిప్యూటీ కేన్ కమిషనర్ జాన్‌విక్టర్, తహసీల్దారు హనుమాన్‌నాయిక్ తెలిపారు. వారు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు బకాయి ఉందని, రాష్ట్ర ప్రభుత్వానికి కొనుగోలు పన్ను బకాయి ఉండడంతో ఆర్‌ఆర్ యాక్టును అమలు చేసి, స్వాధీనం చేసుకున్న భూములు, ఆస్తులకు బుధవారం ఉదయం వేలం పాట నిర్వహణను ప్రారంభించామని తెలిపారు. తొట్టంబేడు సబ్-సబ్ రిజిస్ట్రార్ సమర్పించిన మార్కెట్ విలువలతో వేలం పాట నిర్వహించినప్పటికీ పాటదారులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు శివయ్య, ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య, సర్వేయర్ అరుణకుమారి, వీఆర్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా కేరింత

'గంగమ్మ తల్లి.. వెంకన్న చెల్లి.. జాతరో జాతర.. వేషాలు వేయరా.. మొక్కులు తీర్చరా... అమ్మ కరుణను పొందరా' అంటూ తిరునగరిలో బుధవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర సంబరాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటి నుంచి కుటుంబ సమేతంగా తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పణకు శ్రీకారం చుట్టారు.

- వేడుకగా తాతయ్యగుంట గంగమ్మ జాతర సంబరాలు ప్రారంభం
- సంప్రదాయబద్ధంగా సారె సమర్పించిన ఎమ్మెల్యే భూమన కుటుంబం
- జానపద కళా ప్రదర్శనలతో పులకించిన పురవీధులు
- డప్పు దరువులు.. జనం నృత్యాల హోరుతో శోభాయాత్ర
- అడుగడుగునా పసుపు నీళ్లతో స్వాగతం, హారతులు



సారె ఊరేగింపులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబ సభ్యులు



తాతయ్య గుంట గంగమ్మ సారె ఊరేగింపులో కళా ప్రదర్శనల కోలాహలం



తిరుపతి కల్చరల్: డప్పుల దరువులు, పంబల మోత, మంగళవాయిద్యాలతో గంగమ్మ సారె ఊరేగింపు ఆడంబరంగా సాగింది. నవదుర్గలు, కాంతార, తీన్‌మార్, కొమ్ము కొయ్య నృత్యాలు, దింసా, పగటి వేషాలు, పులివేషాలు, గరగల్లు, బోనాలు, కీలుగుర్రాల ఆటలు, తప్పెట గుళ్ల మోతలు, కోయ నృత్యాలు, కోలాట భజనలు, పిల్లన గ్రోవి వంటి 36 రకాల జానపద కళా ప్రదర్శన సందడితో సారె యాత్ర హోరెత్తింది. వివిధ దేవతామూర్తులు, అమ్మవారి విశ్వరూప కళా ప్రదర్శనలతో పురవీధులు పులకించాయి.

సంప్రదాయబద్ధంగా సారె పూజ

తొలుత పద్మావతిపురంలోని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంట్లో సారె పూజను సంప్రదాయంగా నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డి.సరిత, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లా ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమన దంపతులు, డెప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు సారెతో శోభాయాత్రగా ఆలయానికి బయలుదేరారు.

వెల్లివిరిసిన సామరస్యత

నగరంలో ముస్లింలు గంగమ్మసారె పట్ల చూపిన భక్తి భావం సామరస్యతను చాటింది. డీఆర్ మహల్ వద్ద స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కో ఆప్షన్ సభ్యుడు ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం మహిళలు, ముస్లింలు సారెకు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. బాణాసంచా పేల్చి హారతులు సమర్పించారు. అడుగడుగునా వివిధ పార్టీ నేతలు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలు, ఏఐటీయూసీ నేతలు ఘనంగా సత్కరించారు. శోభాయాత్ర తాళ్లపాక గంగమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ చైర్మన్, పాలక మండలి సభ్యులు హారతులు సమర్పించారు. అనంతరం తాతయ్యగుంట ఆలయం వద్దకు శోభాయాత్ర చేరుకోగానే దేవస్థానం చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునికృష్ణయ్య, పాలక మండలి సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు, కుటుంబసభ్యులు వేదోక్తంగా సారెను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.

భూమన భక్తి సంకల్పానికి జేజేలు

ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్యాత్మిక భక్తి సంకల్పానికి మద్దతుగా రాజకీయాలకతీతంగా నగరంలోని ప్రముఖులు, వివిధ పార్టీ నేతలు, ప్రజాసంఘాలు, సాహితీ వేత్తలు, మహిళలు, ప్రజలు హాజరై గంధం బొట్లు పెట్టుకొని, వేపాకు చేతబూని సారె ఊరేగింపులో అడుగులు వేశారు. అశేష జనవాహినితో పురవీధులు కిక్కిరిశాయి. దారి పొడవునా అమ్మవారి కీర్తనలతో, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు లయబద్ధంగా చిందులు వేస్తూ పులకించి పోయారు. డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ డప్పుల దరువుల మధ్య చిందులు వేయగా, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డి.సరిత కోలాట భజనలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీనివాస కల్యాణ మండపాలు, లక్ష్మీపురం సర్కిల్, ఎస్టీవీ నగర్, డీఆర్ మహల్, రైల్వేస్టేషన్, గ్రూప్ థియేటర్స్, పెద్దకాపు వీధి మీదుగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం వరకు 5 కిలోమీటర్ల మేర సారె శోభాయాత్ర కోలాహలంగా జరిగింది.



సారె సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే భూమన కుటుంబం











సారె ఊరేగింపు ముందు నవదుర్గలు, పులి వేషాలు, డప్పులు, జానపద నృత్య కళా ప్రదర్శనలు

వైఎస్సార్ సీపీలోకి ముస్లిం మైనారిటీ నేతలు



కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: శ్రీకాళహస్తి 16వ వార్డుకు చెందిన టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీకాళహస్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాల్‌బాషా, అహ్మద్, సలీం, ముబారక్, తిరుపతి జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు అబ్దుల్ కలీం తదితరులు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే సాద రంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, ఫజల్, ఫతాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పథకాలు.. బీజేపీ కాపీ

- ఏపీ సంక్షేమ పథకాలను చూసే ఎన్నికల హామీలు
- మన పథకాలను అధ్యయనం చేస్తున్న ఇతర రాష్ట్రాలు, దేశాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎల్లో మీడియా విషపు రాతలు
- రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు: సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు/చౌడేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాలను చూసి బీజేపీ, ఇతర పార్టీలు కూడా కాపీ కొడుతూ మన విధానాలను అమలుపరుస్తామని ఎన్నికల హామీలు ఇస్తున్నాయని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సచివాలయాలు, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ఒక్కసారిగా సుమారు 4 లక్షల మందికి అవినీతికి తావులేకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఇదే విధానాన్ని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి, స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. పలు దేశాలు, రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి మన వ్యవస్థలు, పథకాలపై అధ్యయనాలు చేస్తున్నాయని తెలిపారు. చంద్రబాబునాయుడు రుణాలు మాఫీ అంటూ మహిళలను, రైతులను మోసగించారన్నారు. ఆయన ఎన్నికల మేనిఫెస్టోను కూడా దాచేశారని ఎద్దేవా చేశారు. పదినెలల తరువాత ఎన్నికలు రాబోతున్నాయని, ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించాలని కోరారు.

రెండోసారి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెట్టింపు మేలు చేస్తారని, దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, పీకెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ అక్కిసాని భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా తరపున మీరే పనిచేయాలి..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సుమారు 64 నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యతలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇలాంటి సమయంలో నా తరపున ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు, తన శ్రేయోభిలాషులు కష్టపడి పనిచేయాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు.

ఎల్లోమీడియా విషపు రాతలు

ఈసారి చంద్రబాబునాయుడును ఎలాగైనా సరే అధికారంలోకి తేవాలని ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఈటీవీ, ఏబీఎన్ చానల్, పత్రికలు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొండంత మేలు చేసినా గోరంత కూడా ఎవరికీ చెప్పుకోలేదన్నారు. చంద్రబాబు నాయుడు గోరంత చేస్తే కొండంత రాసే పత్రికలు, చానల్స్ నిజాలు దాచిపెట్టి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. మూడేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి 14 ఏళ్లుగా సీఎంగా ఉన్న చంద్రబాబు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అమరావతి పేరుతో గ్రాఫిక్స్ చూపించి ఎల్లో మీడియా ద్వారా ప్రజలను మోసం చేశారన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ప్రపంచ రాజధాని అన్నట్లు అమరావతిని ప్రచారం చేశాయని ఆరోపించారు. అందుకే మన ప్రజలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నేతలు కలిసి మన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి పొందారని, ఇళ్లు సైతం మంజూరు చేయించామన్నారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సూర్య తేజం..చంద్ర వదనం



సూర్యప్రభపై వేదనారాయణ స్వామి కటాక్షం



చంద్రప్రభపై స్వామివారికి హారతి

పిచ్చాటూరు: నాగలాపురంలో టీటీడీ అనుబంధ శ్రీవేదనారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సూర్యప్రభపై, రాత్రి చంద్రప్రభపై స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తిని అరుణకాంతులీనే పుష్పమాలికలు, విశేష ఆభరణాలు, వజ్ర కవచంతో అలంకరించి సూర్యప్రభపై కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల నడుమ వాహన సేవ ప్రారంభమైంది. స్వామివారి పాదాలపై సూర్యకిరణాలు ప్రసరిస్తుండగా భక్తులు వీక్షించి తన్మయత్వం చెందారు. భక్తుల గోవిందనామ స్మరణలతో తిరువీధులు ప్రతిధ్వనించాయి. మధ్యాహ్నం ఉత్సవర్లకు వేదోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఉంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. రాత్రి చంద్రప్రభపై కొలువుదీరి స్వామివారు తిరువీధుల్లో భక్తుల కర్పూర నీరాజనాలు అందుకున్నారు. టీటీడీ ఏఈఓ మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవ జరుగుతుందని ఆలయ అధికారులు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.30 గంటలకు ఊంజన్ సేవ ఉంటుందని పేర్కొన్నారు.

టీటీడీ నూతన న్యాయాధికారిగా వీర్రాజు

తిరుమల: టీటీడీ న్యాయాధికారిగా వై.వీర్రాజు నియమితులయ్యారు. బుధవారం రంగనాయకుల మండపంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వీర్రాజును టీటీడీ ఈవో ధర్మారెడ్డి లడ్డూ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.



వీర్రాజుకు ప్రసాదాలను అందజేస్తున్న ఈఓ

పట్టాల కుంభకోణంలో అల్లూరయ్య అరెస్టు

రేణిగుంట: శ్రీకాళహస్తి రాజీవ్ నగర్ ఇంటి పట్టాల కుంభకోణంలో పురపాలక సంఘం ఉద్యోగి అల్లూరయ్యను అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి టూ టౌన్ సీఐ మల్లికార్జున తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సీఐ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాళహస్తి మున్సిపల్ ఉద్యోగి అల్లూరయ్య ఇంటిపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించగా, 1,621 పట్టాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటికే వాటిలో 70 ఇంటి పట్టాలు అతను ఇతరులకు విక్రయించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. రాజీవ్ నగర్‌లో అక్రమాలు అధిక సంఖ్యలో జరిగాయని, అక్రమాలకు పాల్పడిన వారందరిని త్వరలోనే అరెస్ట్ చేసి జైలుకు పంపుతామన్నారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ రూప్‌చంద్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మున్సిపల్ ఉద్యోగి అల్లూరయ్యను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లికార్జున వివరించారు. రాజీవ్‌నగర్ ఇంటి పట్టాల కుంభకోణంలో ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ మహేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టుటౌన్ సీఐ మల్లికార్జున

లాడ్జీలో కర్ణాటక వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: నగరంలోని పెద్దకాపు లేఔట్‌లోని ఒక లాడ్జీలో మంగళవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈస్ట్ ఎస్‌ఐ జైశ్యాములు కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా, చిక్బళ్లాపూర్‌కు చెందిన వినోద్ కుమార్ (32) అదే గ్రామంలో జిరాక్స్ షాప్ పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి వివాహమై ఓ కుమారుడు కూడా ఉన్నాడు. మూడు రోజుల కిందట ఇంటి నుంచి చెప్పకుండా వచ్చి పెద్ద కాపు లేఔట్‌లోని ఒక లాడ్జిలో వందన అనే అమ్మాయితో కలిసి గది తీసుకున్నాడు. మంగళవారం గది ఖాళీ చేసేందుకు కింది ఫ్లోర్‌లోని రిసెప్షన్ వద్దకు వచ్చాడు. వస్తువులు మర్చిపోయాను..తీసుకువస్తానని మళ్లీ గదికి వెళ్లాడు. ఎంత సేపటికీ రాకపోవడంతో వందనతో పాటు లాడ్జి సిబ్బంది పైకెళ్లి గదిలో చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. హుటాహుటిన కిందకు దించి రుయా ఆస్పత్రికి తరలించగా... మృతి చెందినట్లుగా డాక్టర్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి తండ్రి వెంకటరామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


యువకుడి మృతదేహం

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్ రెండవ ఫ్లాట్ ఫామ్ వద్ద బుధవారం తెల్లవారు జామున రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఈమేరకు సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసులకు స్టేషన్ మేనేజర్ ధీరేంద్రకుమార్ సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్‌ఐ జి.మాలకొండయ్య ఇక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జగనన్నకు చెబుదాంతో సత్వర న్యాయం

- సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పర్యవేక్షణ
- 1902 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయ వచ్చు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి


జగనన్నకు చెబుదాం అమలును వివరిస్తున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి, చిత్రంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జిల్లా అధికారులు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యలను సత్వరం, సంతృప్తికరంగా పరిష్కారించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఇది దేశంలోనే ఎక్కడ లేని వినూత్నమైన కార్యక్రమమని, ప్రజలు 1902 టోల్ ఫ్రీ నంబర్‌తో కాల్ సెంటర్ ఫోన్ చేస్తే పరిష్కార మయ్యేంత వరకు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో మండల, డివిజన్ స్థాయి అధికారులతో 'జగనన్నకు చెబుదాం' పై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయి నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగి వరకు ప్రజా సేవకులమని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశలో 1902 హెల్ప్ లైన్ ద్వారా అందిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారికి పంపుతారని తెలిపారు. ఈ ఫిర్యాదులను రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని వివరించారు. 1902కు ఫిర్యాదు అందిన వెంటనే ఫిర్యాదుదారు మొబైల్‌కు ఒక సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ పంపుతారని, దీనిపై అన్ని స్థాయిల్లో ట్రాకింగ్ (పర్యవేక్షణ) చేస్తూ నాణ్యమైన పరిష్కారం చూపేలా అధికారులు పనిచేస్తారని చెప్పారు. వలంటీర్లు తమ పరిధిలో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ శ్యామలారావు నెలలో రెండు సార్లు జిల్లాలో పర్యటించి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో పాటు, జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఇతర శాఖల సమన్వయం

జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ప్రతి పోలీస్ స్టేషన్, జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. ఇంతవరకు కోర్టు కేసులు, రెవెన్యు తగాదాలు తదితర అంశాలను ఆయా శాఖలకు పంపిస్తున్నామని చెప్పారు. జగనన్నకు చెబుదాంలో అందిన ఫిర్యాదులను ఇతర శాఖల సమన్వయంతో నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని తెలిపారు. సామాన్య ప్రజలకు సత్వర న్యాయమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. డీఆర్ఓ శ్రీనివాసరావు, ఆర్డీఓలు కిరణ్ కుమార్, రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, డ్వామా పీడీ శ్రీనివాస రావు, డీఎల్‌డివోలు సుశీల దేవి, ఆదిశేషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,390
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,693
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,600
రిటైల్ వెండి గ్రాము	రూ.80.60

అనుమానాస్పద స్థితిలో మేస్త్రీ మృతి


శ్రీనివాసులురెడ్డి మృతదేహం

ఏర్పేడు: మండలంలోని ఏర్పేడు-బండారుపల్లి రోడ్డులో మీల్ కర్మాగారం వద్ద బుధవారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం, బోయల సిరిసిల్ల గ్రామానికి చెందిన మేస్త్రీ సూరం శ్రీనివాసులురెడ్డి(42) పనుల కోసం మంగళవారం మండలంలోని కోబాక గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఏర్పేడు-బండారుపల్లె రోడ్డులోని మీల్ కర్మాగారం వద్ద ఓ కానుగ చెట్టు కింద శ్రీనివాసులురెడ్డి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రం బాగుండాలి.. జగన్ మళ్లీ సీఎం కావాలి

– శ్రీ వారి సేవలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


తిరుమల ఆలయం వెలుపల ఎంపీ ఏంవీవీ సత్యనారాయణ

తిరుమల: రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని చెప్పారు. సీఎం జగన్ ప్రధానిని కలిసిన ప్రతిసారీ పోలవరం, ప్రత్యేక హోదా అంశాలపై వినతులు ఇస్తూనే ఉన్నారన్నారు.

నేటి నుంచి సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్


వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానంలో గురువారం నాలుగు రోజుల సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నట్లు స్థానిక ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు కాళహస్తి భవాన్ అనుదీప్, కోచ్ గౌస్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఏఎల్‌సీఎం మైదానాన్ని పోటీలకు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నాయుడుపేటలో సౌత్ ఇండియా స్థాయిలో రెండవ సారి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. టోర్నమెంట్‌ను ఉదయం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తదితర ప్రముఖులు ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఆంధ్రతోపాటు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన 16 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 7.30 నుంచి 9.30 వరకు, సాయంత్రం 3 గంటలను నుంచి 5.30 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వరుస విజేత జట్లకు రూ.లక్ష, రూ.50వేలు, రూ.30 వేలు నగదు బహుమతులను ఇవ్వనున్నట్లు వివరించారు. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పించినట్లు తెలియజేశారు. నిర్వాహకులు ఏలీషా, యోహన్, టోని, సిరాజ్ బాషా, ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ : ఇద్దరు యువకుల మృతి

- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- సూళ్లూరుపేటలో ఘటన

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీహరికోట రహదారి ఫ్లెఓవర్‌పై మంగళవారం అర్ధరాత్రి రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో నెల్లూరు మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని బాపూజీ కాలనీకి చెందిన సెల్వం హేమనాథన్ (19), వి.శ్రీనివాసులు (22) మోటార్‌సైకిల్‌పై కొబ్బరి బొండాలు తీసుకుని ఇంటికి వస్తున్నారు. ఇదే క్రమంలో మండలంలోని పెరిమిటిపాడు గ్రామం నుంచి షేక్ మస్తాన్(24) మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. పట్టణంలోని ఫ్లైఓవర్‌పై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మోటార్ సైకిళ్లు నడుపుతున్న పెరిమిటిపాడుకు చెందిన మస్తాన్, బాపూజీకాలనీకి చెందిన హేమనాథన్ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుకసీట్లో కూర్చుని ఉన్న శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, బుధవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిబాబు తెలిపారు.

కులం.. కలకలం


తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న దళితులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే ఆదిమూలం

- మాజీ ఎమ్మెల్యే హేమలతపై చర్యలకు డిమాండ్
- సమగ్ర విచారణ చేయాలని వినతి

సత్యవేడు: టీడీపీ మాజీ ఎమ్మెల్యే హెచ్.హేమలత తప్పుడు కుల ధృవీకరణ పత్రంపై విచారణ చేసి దళితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో బుధవారం సత్యవేడు దళిత సంఘం నాయకులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దారు శ్రీదేవిని కోరారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, అంతకు ముందు సత్యవేడు ఎంపీపీగా ఎన్నికల్లో ఎస్సీ కుల ధృవీకరణ పత్రంతో హేమలత ఎన్నికయ్యారని, ఆమె ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, బీసీ-సి కేటగిరీకి చెందిందన్నారు. ఆమె చదివిన రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సమాచారహక్కు చట్టం ద్వారా ఇచ్చిన కుల ధృవీకరణ పత్రంలో ఆమె ఆది ఆంధ్ర క్రిష్టియన్‌గా నమోదై ఉందన్నారు. గతంలో తప్పుడు కుల ధృవీకరణపత్రాలు ఇచ్చి ఆమె ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేసిందన్నారు. సమగ్ర దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. దళిత నాయకులు గోవింద స్వామి, ఎంపీ రవి, పూలపళణి, టింకాయల కృష్ణయ్య, రమణయ్య, మాణిక్యం, మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్‌స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ బొప్పన సోమశేఖర్, శ్రీరాములు రెడ్డి పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జున

తొట్టంబేడు(రేణిగుంట) : దారి దోపిడీలకు పాల్ప డుతున్న పట్టణానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ మల్లికార్జున తెలిపారు. బుధవారం స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కేవీబీపురం మండలం కొండల్లో ఆదరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌పై ఇద్దరు దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.7వేలు నగదు దోచుకుని వెళ్లారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొంది అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం పట్టణంలో అనుమానస్పందంగా తిరుగుతున్న పెద్ద మసీదు వీధికి చెందిన ఇస్మాయిల్, రఫీను అదుపులోకి తీసుకుని విచరించగా దోపిడీ చేసింది తామేనని అంగీకరించారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో ఆలయానికి వచ్చే భక్తులను బెదిరించి సెల్ ఫోన్‌లు లాక్కొని వెళ్లడం, దాడి చేసి నగదు దోచుకుని వెళ్లడం వంటి కేసులు ఇస్మాయిల్‌పై ఉన్నాయని సీఐ తెలిపారు. ఎస్‌ఐ మహేష్, కానిస్టేబుల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు హెచ్చరించారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం తిరుపతి సర్కిల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్ సరఫరా, ఏపీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఎక్కువగా వస్తున్నాయి, వాటిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ..అనే అంశాలపై డివిజన్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ సంతోషరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా ఇవ్వాలని సూచించారు. వినియోగదారులకు అందిస్తున్న సేవల్లో లోపంపై క్షేత్ర స్థాయిలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపే అధికారులు, సిబ్బందిపై చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసిన వెంటనే యుద్ధప్రతిపాదికన సర్వీసులను మంజూరు చేయాలని తెలిపారు. జగనన్న కాలనీల విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. పేరుకుపోయిన విద్యుత్ బకాయిలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వసూళ్లపై మరింత శ్రద్ధ పెట్టాలని ఎస్ఏఓ శ్రీనివాసులుకు చురకలు వేశారు. విద్యుత్ పంపిణీ నష్టాలు ఎక్కువగా ఉన్న ఫీడర్లను గుర్తించి, నష్టాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ 1912 లేదా 1800 425 155333 నంబరుకు కాల్ చేసి వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డైరెక్టర్లు వీఎస్ బాబు, సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి, సీజీయంలు గురవయ్య, ధర్మజ్ఞాని, ఎస్ఈ కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళా కూలీ మృతి


అంకమ్మ మృత దేహం(ఇన్‌సెట్) అంకమ్మ (ఫైల్)

రాపూరు: మండలంలోని పంగిలి చెక్‌పోస్టు సమీపంలో బుధవారం కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన కథనం.. పంగిలికి చెందిన మల్లి అంకమ్మ(40) గ్రామ సమీపంలోని మద్దురుపల్లె వద్ద ఉపాధి హామీలో కూలి పనులు ముగించుకుని పొలాల వైపు వెళుతోంది. పంగిలి చెక్ పోస్టు వద్ద రోడ్డు దాటుతుండుగా రాజంపేట నుంచి నెల్లూరు వెళుతున్న కారు అతివేగంగా అంకమ్మను వెనక వైపు నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆమె ఎడమ కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు. అంకమ్మకు భర్త కోటేశ్వరావు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తిరుపతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తిరుపతిని రూపుదేద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో చైర్మన్ హోదాలో మాదక ద్రవ్యాల నిరోధానికి సంబంధించి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. ఇందుకు తాము సంపూర్ణ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో పాఠశాలలు, హాస్టళ్లలో మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచేలా చైతన్యం తీసుకు రావాలని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్‌కు సిఫార్స్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాదకద్రవ్యాల నివారణ కమిటీ కన్వీనర్ హోదాలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 2023 సంవత్సరంలో నాలుగు నెలల కాలానికి సెబ్‌తోపాటు పోలీస్ అధికారులు 30 గంజాయి కేసులు నమోదు చేసి 152 మందిని అరెస్టు చేసి, 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 91 డ్రగ్ అవేర్నెస్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కళాశాలలు, విద్యా సంస్థలు ప్రధాన కూడళ్లలో 95 హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్, జిల్లా డ్రగ్స్ నివారణ అధికారిని సుభాషిణి, పోర్టు సెక్యూరిటీ అధికారి మేజర్ వెంకటేష్ భాస్కర్, ఇంటిలిజెన్స్ బ్యూరో అధికారి శిరీష, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సెబ్ అధికారిణి స్వాతి, ఎస్డీపీవో చంద్రగిరి యశ్వంత్, ఏఈఎస్ శ్రీనివాస్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.